GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : శుక్రవారం- డిసెంబర్ 22-2023 పేజీలు : 3

## కుస్తీ వదిలేస్తున్నా.. ఏడ్చేసిన సాక్షి మాలిక్



**టీ మీడియా, డిసెంబర్ 21, న్యూఢిల్లీ:** రెజ్లర్ సాక్షి మాలిక్ ఆవేదనకు గురయ్యారు. రెజ్లింగ్ క్రీడను వదిలేస్తున్నట్లు ఆమె చెప్పారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష ఎన్నికల్లో .. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ విజయం సాధించడం .. మహిళా రెజ్లర్లను కలిచివేసింది. 40 రోజులగా రోడ్లపై ధర్నా చేపట్టామని, తమకు దేశవ్యాప్తంగా ప్రజలు అండగా నిలిచారని, కానీ ఎన్నికల్లో తమ అభ్యర్థి ఓటమి పాలైనట్లు సాక్షి మాలిక్ ఇవాళ మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. బ్రిజ్ భూషణ్ బిజినెస్ పార్ట్నర్ విజయం సాధించారని, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, అందుకే రెజ్లింగ్ క్రీడకు వీడ్కోలు పలుకుతున్నట్లు సాక్షి మాలిక్ వెల్లడించారు. సంజయ్ గెలుపును తట్టుకోలేకపోయిన సాక్షీమాలిక్.. మీడియా సమావేశం నుంచి ఏడ్చుకుంటూ బయటకు వెళ్లిపోయారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నిక కావడం.. రెజ్లింగ్ భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లినట్లు ఉందని రెజ్లర్ వినోశ్ పోగట్ తెలిపారు. తమకు స్వల్ప స్థాయిలో మాత్రమే నమ్మకం ఉందని, తమకు న్యాయం జరుగుతుందన్న ఆశ ఉన్నట్లు ఆమె చెప్పారు. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాము ఇంకా పోరాడుతూనే ఉన్నామన్నారు.



## పెళ్లైన ఐదు రోజులకే

### గోదావరిలో దూకేసిన కొత్త జంట

**టీ మీడియా, డిసెంబర్ 21,పశ్చిమగోదావరి :** కొత్త జీవితంపై కోటి ఆశలతో వివాహబంధంతో ఒక్కటైన ఆ జంట పెళ్లయి 5 రోజులు గడవకముందే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరూ కలిసి గోదావరిలో దూకారు. వధువు ప్రాణాలు కోల్పోగా ప్రాణభయంతో వరుడు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ఈ ఘటన పశ్చిమగోదావరి జిల్లాలో పెనుగొండలో చోటు చేసుకుంది. వధువు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉంద్రాజవరం మండలం మోర్తకు చెందిన వరుడు కె.శివరామకృష్ణతో వడలికి చెందిన కోరాడ సత్యవాణికి డిసెంబరు 15న వివాహమైంది. మంగళవారం రాత్రి వడలి నుంచి వీరిద్దరూ సినిమాకి వెళ్తున్నామని ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లారు. అలా వెళ్ళినవారు రాత్రయినా ఇంటికి తిరిగి చేరుకోలేదు. ఇటు పుట్టిల్లు%ా% అటు అత్తవారిల్లు ఏ ఇంటికీ వాళ్లువెళ్లలేదు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు.అయితే బుధవారం దంపతులు ప్రయాణించిన బైక్ సిద్దాంతం వంతెన వద్ద గుర్తించారు. సిద్ధాంతం వంతెన వద్ద వారి బండి, వరుడు ఈదుకొచ్చిన చోట వధువు చెప్పులు ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో దంపతులిద్దరు నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని వుంటారని పోలీసులు భావించారు. కానీ ఇంతలోనే షాకింగ్ విషయం బయటపడింది. రామకృష్ణ బ్రతికే వున్నాడని%ా% తణుకులోని ఓ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. అతడిని విచారించగా అసలేం జరిగిందో బయటపెట్టాడు. భార్య,భర్త ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవాలని భావించామని, దీంతో ఇద్దరం కలిసి గోదావరి నదిలో దూకినట్లు రామకృష్ణ తెలిపారు. తాను ప్రాణభయంతో ఈదుకుంటూ వచ్చేశానని, తన భార్య మాత్రం నీటమునిగి గల్లంతయిపోయిందని చెప్పాడు. పెళ్లయిన ఐదురోజులకే ఆత్మహత్య చేసుకోవాలని అనుకోవడం ఏమిటి? నదిలో దూకిన నవదంపతుల్లో భార్య చనిపోయి భర్త బ్రతకడం ఏమిటి? ఇదేదో అనుమానంగా వుందని సత్యవాణి కుటుంబసభ్య లు ఆరోపిస్తున్నారు. కట్నం కింద లక్షా 60 వేలు, బంగారు ఆభరణాలు పెట్టామని వధువు కుటుంబసభ్యులు చెబుతున్నారు. శివరామకృష్ణ ఏదో చేసి నాటకం ఆడుతున్నాడని వధువు బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పెనుగొండ పోలీసులు తెలిపారు. శివరామకృష్ణ ఏదో చేసి నాటకం ఆడుతున్నాడని వధువు బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పెనుగొండ ఎస్సై రమేష్ తెలిపారు.

## విద్యుత్ సరఫరా,

# ఉత్పత్తిపై శ్వేతపత్రం

### డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



**టీ మీడియా, డిసెంబర్ 21, హైదరాబాద్:**
తెలంగాణలో విద్యుత్ రంగం పరిస్థితి ఆందోళకరంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి కరెంటు నిరంతర సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలతో శ్వేతపత్రాన్ని శాసనసభలో గురువారం ఆయన ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా, ఉత్పత్తి గురించి అందరికీ తెలియాలనే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని తెలిపారు. 2023 నాటికి విద్యుత్ రంగం అప్పులు రూ.81,516 కోట్లు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. డిస్కంలకు వివిధ శాఖల నుంచి రూ.28,673 కోట్ల బకాయిలు ఉన్నాయని చెప్పారు. మొత్తంగా డిస్కంలు రూ.62,641 కోట్ల నష్టంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వివరాలను ప్రజలకు వివరించడంతో పాటు వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. గత ప్రభుత్వం అస్తవ్యస్త నిర్ణయాలతో విద్యుత్ రంగం ఆర్థికంగా కుదేలయిందని, ఈ స్థితిని చక్కదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

## ఔట్ సోర్సింగ్

# ఉద్యోగాల పేరిట మోసం..

### కలెక్టర్ పేరుతో నకిలీ ఉత్తర్వులు



**టీ మీడియా, డిసెంబర్ 21,యాదాద్రి:** చదివింది ఇంటర్మీడియట్. జులాయిగా తిరిగాడు.. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఏకంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు తెగబడ్డాడు. నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఉన్నతాధికారుల పేరుతో స్టాంపులు తయారుచేసి, నకిలీ నియామక పత్రాలను సృష్టించి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుతో ఏకంగా కటకటాల పాలయ్యాడు ఓ యువకుడు.యాదాద్రి జిల్లా మోటకొండూరు మండలం వర్టూరుకు చెందిన ఆలేటి నవీన్ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. వ్యసనాలకు అలవాటు పడి జులాయిగా తిరిగేవాడు. ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కాడు. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు తెరదీశాడు. భువనగిరి పట్టణంలోని సంజీవ్ నగర్ కు చెందిన రాజమణి అనే మహిళ ద్వారా 11 మంది నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఈ క్రమంలోనే గతంలో జిల్లా కలెక్టర్ గా వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీల సంతకాలను ఫోర్జరీ చేసి, స్టాంపులు తయారు చేసి వివిధ శాఖలకు సంబంధించిన అపాయింట్మెంట్ ఆర్డర్ బాధితులకు ఇచ్చాడు. తాను చెప్పిన సమయంలో ఉద్యోగంలో జాయిన్ కావాలని వారికి సూచించాడు. కానీ కాలయాపన జరుగుతుండడంతో ఉద్యోగంలో చేరుతామని అడుగుతున్న వారికి రేపుమాపు అంటూ దాటవేశాడు. దీంతో ఆరా తీసిన బాధితులకు విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. దీంతో నిలదీయడంతో అసల బండారం బయటపడింది.తమకు ఇచ్చినవి నకిలీ ఉత్తర్వులని తెలియడంతో బాధితులు.. తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని నవీన్ నిలదీశారు. పంచాయతీ చేసిన పెద్ద మనుషుల సమక్షంలో బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించేలా బాండ్ పేపరు రాసి ఇచ్చాడు. అయినా డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు భువనగిరి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఘరానా మోసగాడిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ జరిపి రిమాండ్‌కు తరలించారు.

## అవినీతి కేసులో మంత్రి పొన్ముడికి మూడేళ్ల జైలు శిక్ష



**టీ మీడియా, డిసెంబర్ 21, చెన్నై:** అవినీతి కేసులో తమిళనాడు మంత్రి కె. పొన్ముడికి మద్రాస్ హైకోర్టు గురువారం మూడేళ్ల జైలుశిక్ష విధించింది. అయితే సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు 30 రోజుల గడువు ఇచ్చింది. పొన్ముడి వెంటనే జైలులో లంగిపోవాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. రూ.1.75 కోట్ల అక్రమాస్తుల కేసులో రెండు రోజుల క్రితం ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ.. డిఎంకె నేత, మంత్రి పొన్ముడి, ఆయన భార్యను మద్రాస్ హైకోర్టు దోషులుగా నిర్ధారించిన సంగతి తెలిసిందే. నిబంధనల ప్రకారం.. చట్టసభల సభ్యులను కోర్టు దోషిగా నిర్ధారించినట్లైతే.. వారు పార్లమెంటు లేదా అసెంబ్లీకి అనర్హులు. దీంతో పొన్ముడి దోషిగా తేలడంతో ఆయనను మంత్రి పదవి నుండి తొలగించినట్లు సమాచారం. ఆయన పోర్ట్‌ఫోలియోను మరొకరికి అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను తన మంత్రి వర్గం నుండి తప్పించాలని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి డిమాండ్ చేసిన మరుసటి రోజే శిక్ష ఖరారు కావడం గమనార్హం.

## సింగరేణి ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**టీ మీడియా, డిసెంబర్ 21హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మరో ఎన్నికల సందడి ప్రారంభమైంది. డిసెంబర్ 27వ తేదీన సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వాహణ కోసం రంగం సిద్ధమైంది.ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ నెలలో జరగాల్సిన ఈ ఎన్నికలు, అనేక తర్జనభర్జనల మధ్య కోర్టు ఆదేశాల మేరకు వాయిదా పడ్డాయి.రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడిన సింగరేణి ఎన్నికలను డిసెంబర్ 27న నిర్వహించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మొత్తం మీద ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత సాధించిన 13 కార్మిక సంఘాలు, ఇక ప్రచారంపై దృష్టి సారించనున్నాయి.కార్మికులను ప్రసన్నం చేసుకోవడం కోసం వ్యూహరచనల్లో నిమగ్నమయ్యారు.



## ఆర్టీసీ బస్సును దహనం చేసిన మావోయిస్టులు

**టీ మీడియా, డిసెంబర్ 21,రాయ్ పూర్:**
చత్తీస్ గఢ్-ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని చింతూరు మండలంలో బుధవారం రాత్రి ఆర్ టిసి బస్సుతో పాటు రెండు ట్రక్కులను మావోయిస్టులు దగ్ధం చేశారు.రాత్రి 8:30 గంటలకు జగదల్పూర్ నుండి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఆసీర్ గూడెం గ్రామ%శీ% వద్ద మావో యిస్టులు నిలిపివేసి దగ్ధం చేశారు.అలాగే మరో రెండు ట్రక్కులను డీజిల్ పోసి దగ్ధం చేశారు. చింతూరుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఈ సంఘటన జరిగింది. ఆశీర్వాదం గ్రామ%శీ% వద్ద తాగు నీరు కోసం ప్రయాణికులు దిగిన తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుందని సమాచారం.ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగ లేదని పోలీసులు చెబుతు న్నారు. పంచనామా చేసిన పోలీసులు కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు చేపట్టారఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సీఎం పదవుల కోసం పార్టీలు మారిండు

### రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం



**టీ మీడియా, డిసెంబర్ 21, హైదరాబాద్ :**
పదవుల కోసం సీఎం రేవంత్ రెడ్డి పార్టీలు మారిండు తప్పు.. మేం అలాంటి పని చేయలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నాం.. దాంట్లో తప్పేముందని హరీశ్‌రావు ప్రశ్నించారు. శాసనసభలో విద్యుత్ రంగ పరిస్థితిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీ ప్రజలు కరెంట్ బిల్లులు కట్టలేదు. ఇక బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, టీడీపీ, ఎంఐఎంతో పొత్తు పెట్టుకుందని వ్యాఖ్యానించారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై క్లారిఫికేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తాను. దండం పెడుతా మైక్ కట్ చేయకండి. సిద్దిపేట, గజ్వేల్, ఓల్ట్ సిటీ ప్రజల మీద సీఎం అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేశారు. సిద్దిపేటలో, గజ్వేల్, ఓల్ట్ సిటీలో కాంగ్రెస్ గెలవలేదనే బాధలో రేవంత్ ఉన్నారు. దాంతో బిల్లులు అక్కడ ప్రజలు కట్టలేదన్నారు. ఇది వాస్తవం కాదు. అక్కడ ఏదాన్న ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుదో, ఒక ఇండస్ట్రీయలిస్ట్ ఎవరన్న కట్టకపోతే, ఆ బిల్లులు వసూలు చేయండి తప్పు.. నియోజకవర్గ ప్రజలను బద్నాం చేయడం సబబు కాదు అని సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సూచించారు.

## అక్రమాలపై పోరాడితే చంపేస్తామని బెదిరిస్తారా?

### పవన్ కళ్యాణ్ ఫైర్




**టీ మీడియా, డిసెంబర్ 21, అమరావతి :** ఏపీ ప్రభుత్వం, వైసీపీ నాయకులపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మండిపడ్డారు. విశాఖపట్నం కేంద్రంగా వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలు, చట్ట ఉల్లంఘనలపై న్యాయ పోరాటం చేస్తున్న తమ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌ను చంపేస్తామని బెదిరించడం అధికార పక్షం వైఖరిని తెలియజేస్తుందని అన్నారు. ప్రశ్నించడం, చట్ట ఉల్లంఘనలపై పోరాడటం ప్రజాస్వామ్యంలో భాగమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేని పాలకులు, వారి అనుయాయులు న్యాయ పోరాటాలను తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రాణహానికి తలపెట్టారని ఆరోపించారు. విశాఖపట్నంలో రుషికొండను తొలిచేసి ప్యాలెస్ నిర్మించడంపై, దసపల్లా భూముల వ్యవహారం, టీడీఆర్ స్కామ్, టైకూన్ కూడలి మూసివేత, క్రైస్తవ ఆస్తులను కొల్లగొట్టి భారీ భవనాలు నిర్మించడం వంటి వైసీపీ చేస్తున్న అనేక అక్రమాలపై మూర్తి యాదవ్ పోరాడుతున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జీవీఎంసీలో చోటు చేసుకుంటున్న అవినీతి చర్యలు, తప్పుడు ర్యాటిఫికేషన్లపై కౌన్సిల్ సమావేశాల్లో బలంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయనకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. మూర్తి యాదవ్‌కు ప్రాణహాని తలపెట్టిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయనకు ఏ చిన్నపాటి హాని కలిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.



## కేజ్రీవాల్ జైల్లో కూడా విపాసన చేయగలరు

### బీజేపీ ఎద్దేవా

**టీ మీడియా, డిసెంబర్ 21, న్యూఢిల్లీ :** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గురువారం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. జవాబుదారీతనం, అరవింద్ కేజ్రీవాల్ కలిసి సాగలేరని కాషాయ పార్టీ ఎద్దేవా చేసింది. కేజ్రీవాల్, కర్తవ్యం ఎన్నడూ కలిసి పనిచేయలేవని బీజేపీ నేత సంబిట్ పాత్ర స్పష్టం చేశారు. కేజ్రీవాల్ జైల్లో విపాసన చేయగలరని వ్యాఖ్యానించారు. విపాసన పేరుతో తలదాచుకునేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాగా మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ ల్యాండరింగ్ కేసులో ఈడీ తనకు సమన్లు జారీ చేయడాన్ని కేజ్రీవాల్ సవాల్ చేసిన అనంతరం బీజేపీ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ రెండోసారి సమన్లు జారీ చేయగా వాటిని బేఖాతరు చేస్తూ ఢిల్లీ సీఎం పది రోజుల విపాసన మెడిటేషన్ క్యాంప్‌కు వెళ్లారు. ఇక ఈడీ తనకు పంపిన సమన్లు అక్రమమని, రాజకీయ దురుద్దేశంతో కూడినవని కేజ్రీవాల్ అభివర్ణించారు. ఈ విషయంలో తాను దాచేందుకు ఏమీ లేదని స్పష్టం చేశారు. తాను ఎలాంటి సమన్లనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, గత సమన్ల తరహాలో తాజా ఈడీ సమన్లు కూడా రాజకీయ దురుద్దేశంతో కూడినవని కేజ్రీవాల్ పేర్కొన్నారు. సమన్‌ను ఉపసంహరించాలని, తాను నిజాయితీ, పారదర్శకతతో కూడిన జీవితం గడిపానని, తనవద్ద దాచేందుకు ఏమీ లేదని ఆప్ అధినేత వెల్లడించారు.

# పేదలకు మంచి విద్య ఇస్తుంటే..

### విపక్షాలు విషం కక్కుతున్నాయి

### సీఎం జగన్



**టీ మీడియా, డిసెంబర్ 21, అల్లూరి జిల్లా:** విద్యార్థులకు మంచి చేస్తుంటే విష ప్రచారం చేస్తున్నారని, విద్యార్థులకు చెడు చేస్తున్నామంటూ తప్పుడు రాతలు రాశారంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విపక్షాలపై మండిపడ్డారు. "గిట్టని వాళ్లు జగన్ దుబారా చేస్తున్నాడంటూ మాట్లాడుతున్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఈ స్థాయిలో ఖర్చుచేయలేదు. ఖర్చు చేసే ప్రతీ రూపాయి భావితరాల కోసమే" అని సీఎం పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్స్ పంపిణీ చేపట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి సీఎం జగన్.. గురువారం ఈ పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే. విద్యార్థులకు మంచి చేస్తుంటే విష ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులకు చెడు చేస్తున్నామంటూ తప్పుడు రాతలు రాశారు. పేద విద్యార్థులపై విషం కక్కొద్దని చెబుతున్నా. దిగజారుడు రాతలు రాయొద్దని చెబుతున్నా. పేద పిల్లల చేతిలో ట్యాబ్‌లు ఉంటే చెడిపోతారంట. పేద విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో చదవద్దా?. పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదివితే తెలుగు అంతరించుకుపోతుందట. పేదలకు మంచి చేస్తుంటే మీకెందుకు ఈ కడుపుమంట. పేదల పిల్లలకు మంచి చేస్తుంటే విపక్షాలు ఏడుస్తున్నారు. ఇటువంటి దిక్కుమాలిన రాజకీయాలతో యుద్ధం చేస్తున్నాం" అంటూ సీఎం జగన్ ధ్వజమెత్తారు.

## తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

- అక్బరుద్దీన్ ఒవైసీ



**టీ మీడియా, డిసెంబర్ 21, హైదరాబాద్ :**
తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. 24 గంటల నిరంతర విద్యుత్ అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ రంగ పరిస్థితిపై సభలో నిర్వహించిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడారు. అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించిన రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ.. దేశ సగటు కంటే ఎక్కువగా ఉందన్నారు. పాతబస్తీలో గత ప్రభుత్వ హయాంలో రూ. 25 వేల కోట్ల అభివృద్ధి జరిగింది. ప్రజాప్రతినిధిగా సమస్యలను ప్రస్తావించడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరిస్తారో.. లేదో ప్రభుత్వ ఇష్టం అని ఒవైసీ పేర్కొన్నారు. 2014తో పోలిస్తే తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి భారీగా పెరిగింది. రాష్ట్రంలో విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లను పెద్ద సంఖ్యలో పెంచారు. చాలాకాలం వరకు గృహ వినియోగదారులకు కరెంట్ ఛార్జీలు పెంచలేదు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా భారీగా పెరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జెన్‌కో ఆస్తులు రూ. 12 వేల 783 కోట్ల నుంచి రూ. 40 వేల 454 కోట్లకు పెరిగాయి. ప్రతి ఇంటికి 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దాని గురించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు. గృహజ్యోతి భారాన్ని ఇతర వినియోగదారులపై వేయొద్దు. ప్రభుత్వ శాఖల విద్యుత్ బిల్లులు నేరుగా డిస్కంలకు చెల్లించాలి అని అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

## రాముడు మృతదేహానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**టీ మీడియా, డిసెంబర్ 21, చిన్నంబావి :**



చిన్నంబావి మండలం మియ్యాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, తండ్రి జల్ల రాముడు అనారోగ్యం తో మరణించారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,జల్ల రాముడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించి వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబ సభ్యుల కు మనో ధైర్యం చెప్పారు.మంత్రి జూపల్లి కృష్ణారావు,ప్రధాన అనుచరులు పెబ్బేటి రాంచంద్రారెడ్డి,ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్,బిచుపల్లి యాదవ్,రంజిత్ కుమార్, తెజారెడ్డి,ఎంపీటీసీ మహదేవుగౌడ్,నాగరాజు,వడ్డెమాన్ బిచ్చన్న,జ్యోతి గౌడ్,తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు

**టీ మీడియా, డిసెంబర్ 21, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు పరిధిలోని బార్ అసోసియేషన్ హాల్లో గురువారం కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా కోర్టు అధ్యక్షులు సి మోహన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరూ సమాజంలో సుఖశాంతులతో జీవించాలని ప్రేమ అభిమానం ఆప్యాయతలతో జీవిస్తూ ప్రతినిత్యం జీసస్ క్రీస్తు చెప్పిన మంచి మార్గంలో ప్రయాణంలో జీవించాలని న్యాయధికారులు న్యాయవాదులు కూడా ప్రజలతో మంచి మార్గంలో సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ రవికుమార్, రెండవ అదనపు సివిల్ జడ్జి జానకి, పాస్టర్ కృపాకర్, సీనియర్ న్యాయవాదులు నాగేశ్వర్, రామకృష్ణారెడ్డి, పురుషోత్తం, శ్రీనివాస చారి, దేవి ప్రకాష్ రావు, భారత్ కుమార్, కిరణ్ కుమార్, జాకీర్ హుస్సేన్, అనంతరాజు, చిరంజీవి, జయలక్ష్మి, కళ్యాణి, రేణుక, అక్షయ్ తో పాటు దాదాపు 50 మంది జూనియర్ న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై మానవహారంతో నిరసన ర్యాలీ

- పది రోజుల గా సమ్మె చేస్తున్నా చలించని ప్రభుత్వం

**టీ మీడియా, డిసెంబర్ 21, మహానంది:**



మహానందిలోని నంది సర్కిల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మానవహారంతో నిరసన తెలిపి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేస్తూ గురువారం అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలు 10 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి కనీసం చలనం లేదన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే సమస్యల పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు అంగన్వాడీల సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని, ముఖ్యమంత్రి మొండి వైఖరి వీడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, తమ న్యాయమైన కోరికలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, నారాయణమ్మ, గౌరీ,చండీ దేవి, మహేశ్వరి, పుష్పకళ, ఖైరున్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**టి మీడియా, డిసెంబర్ 21, పెద్దపల్లి :**



జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ సూచన మేరకు గురువారం పెద్దపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ స్టాచ్ వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ వారం రోజుల క్రితం పార్లమెంటులో జరిగిన బాష్పవాయు ప్రయోగాన్ని చేయించింది కాంగ్రెస్ పార్టీ కావున కాంగ్రెస్ ఎంపీ లను పార్లమెంటు సభ నుండి బహిష్కరించడం జరిగిందన్నారు. కానీ రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఎంపీలు చేసిన బాష్పవాయు నిర్వాహకాన్ని కప్పిపుచ్చడానికి ఉపరాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంకర్ ని అవమానపరుస్తూ మాట్లాడడం జరిగినది. దీనికి నిరసనగా పెద్దపల్లి మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ తగలబెట్టడం జరిగింది. భారతదేశం పవిత్రమైనటువంటి పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తన దిగజారుడు బుద్ధితో అపవిత్రమైన మాటలతో రాజ్యసభలో చైర్మన్ మరియు ఉపరాష్ట్రపతి అయినటువంటి జగదీప్ ధంకర్ పై మాట్లాడినటువంటి అనుచిత మాటలు చాలా అవమానకరంగా, భారతదేశాన్ని అవమానపరిచే రీతిలో మాట్లాడిన ఈ మాటలను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాహుల్ గాంధీని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, తంగెడ రాజేశ్వరరావు, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ పెద్దపల్లి పట్టణ ప్రదాన కార్యదర్శి పెంజర్ల రాకేష్,గుడ్ల సతీష్ ఎర్రోళ్ల శ్రీకాంత్ వేల్పుల రమేష్ ఈర్ల శంకర్ లక్ష్మణ్ పిట్ట వినయ్ కుమారస్వామి వేణు మంద శ్రీనివాస్, మధుకరణ్,వేల్పుల శ్రీను,ఉదయ్, సాయి కోటి, రాజు, ప్రశాంత్, వంశీ, సోడబాబు పలువురు పాల్గొన్నరు.



## షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞాన సదస్సు

**టీ మీడియా, డిసెంబర్ 21, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణ బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో మానవ అక్రమ నిరోధక విభాగం, షీ టీమ్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞాన సదస్సు వనపర్తి పట్టణ స్థానిక బ్రిలియంట్ పాఠశాలలో వనపర్తి జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థి విద్యార్థినులకు అంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీమ్స్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్టియూ ఎస్సై అంజాద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశలో విద్యా పై దృష్టి సాగి%శీ%చాలి. మొబైల్ వాడకం, వాహనాలను మైనర్ వాడుతున్నారు. 18 సంవత్సరాలు దాటిన విద్యార్థుల కు స్కూటీ ,గేర్ వాహనాలు నడపడా నికి అర్హులు నేటి విద్యార్థులకు చట్టాల పై అవగాహన ఉండాలి. ఆర్డీయెస్ ఒరిటర్ సౌజన్య, షీ టీం ఉమెన్ ఎస్సై ఇందిర. సైబర్ క్రైమ్ ఎస్సై అభిషేక్ రెడ్డి విద్యార్థిని లకు గుడ్ టచ్ బాడ్ టచ్ బాల్య వివాహాలు సైబర్ క్రైమ్ లో వాట్సాప్ చాటింగ్, ఇమేజ్ మార్ఫింగ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ వారు చేపట్టిన మంచి కార్యక్రమ%శీ% చాలా వరకు విద్యార్థుల కు చైతన్యం కల్గి%శీ%చడం వల్ల భావి భారత పౌరుల భవిష్యత్ కోసం పోలీస్ వారు చేస్తున్నా కార్యక్రమాలు ప్రశంసనీయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయమా ఉపాధ్యాయులు దయానంద్, వెంకటేష్, పరుశురాం, ఫణి భూషణ్, రాఘవేంద్ర, కవిత, మనీష తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పరిశ్రమలను కాపాడండి.!

- మూతపడిన వాటిని పునరుద్ధరించాలి
- చిన్నపరిశ్రమల పునరుద్ధరణకు కేంద్రం తీసుకుంటున్నచర్యలేమిటీ ?
- ఎంపీ నామ నాగేశ్వరరావు




**టీ మీడియా, డిసెంబర్ 21, న్యూఢిల్లీ :**
దేశంలోని పలు రాష్ట్రాల్లో గత ఐదేళ్ళ కాలంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పలు కారణాలతో మూత పడడం పట్ల బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఈ విషయమై లోక్ సభలో కేంద్ర ప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. గత ఐదేళ్ళ లో దేశంలో ఎందుకు పెద్ద ఎత్తున సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూత పడ్డాయని, ఇందుకు గల ప్రధాన కారణాలను తెలియజేయాలని ఎంపీ నామ కేంద్రాన్ని నిలదీశారు. ఆ విధంగా మూతపడిన పరిశ్రమలను పునద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని నిలదీశారు.01 -07-2020 నుంచి 15 -12-2023 వరకు దేశ వ్యాప్తంగా 32,754 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూత పడినట్లు కేంద్ర మంత్రి వెల్లడించడం పట్ల ఎంపీ నామ ఆందోళన వ్యక్తం చేశారు. వీటి సంఖ్య ఏడాదికేడాది పెరుగుతుందని, 2020 -21 లో మూత పడిన వాటి సంఖ్య 175 ఉంటే 2021 -22 లో 6, 222, 2022 -23 లో 13, 290 కి చేరడం గమనార్హమని అన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని, దీని వల్ల ఉపాధి దెబ్బతిని నిరుద్యోగిత మరింత పెరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, మూతపడ్డ వాటిని తిరిగి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని నామ కోరారు. ఈ విషయమై కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ సమాధానం ఇస్తూ గత ఐదేళ్ల లో దేశంలో 32, 754 మంది వ్యాపారాన్ని రద్దు చేసుకున్నారని చెప్పారు. కాగా దేశంలో ఈ నెల 15వ తేదీ వరకు ఈ ఐదేళ్ల లో రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా 1, 21, 11, 249 మంది కొత్తగా వ్యాపారాల కోసం నమోదు చేసుకున్నారని చెప్పారు. చిన్న వ్యాపారుల కోసం ప్రభుత్వం అనేక ప్రోత్సహాలను అందిస్తూ, వ్యాపారాభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. సాంకేతిక సాయం చేయడం తో పాటు మౌలిక సదుపాయాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, మార్కెటింగ్ సదుపా యాలు వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వారికి మద్దతుగా కొన్ని పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పారు.

## రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నిక

**టీ మీడియా, డిసెంబర్ 21, న్యూఢిల్లీ:**



భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడే.. ఇవాళ రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 47 ఓట్లలో సంజయ్ సింగ్‌కు 40 ఓట్లు పోలయ్యాయి. బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించినట్లు మహిళా రెజ్లర్లు ఆరోపించిన కేసులో ఆయన సమాఖ్య బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో అనితా షీరాన్ ఓటమి పాలయ్యారు. కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణం గెలిచిన అనితాకు టాప్ రెజ్లర్లు మద్దతు ఇచ్చారు. కానీ సమాఖ్య ఎన్నికల్లో మాత్రం బ్రిజ్ వర్గానికే పెద్ద పీట దక్కింది. బ్రిజ్ గత 12 ఏళ్లుగా రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా సంజయ్ సింగ్ గతంలో పనిచేశారు. 2019 నుంచి డబ్ల్యూఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శిగా చేశారు. అయితే ఇదే ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ పోస్టు కోసం రేసులో ఉన్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్.. ఓటమి పాలయ్యారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్స్, సెక్రటరీ జనరల్, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోస్టులకు ఎన్నికలు జరిగాయి.

# పార్లమెంట్ భద్రతా వైఫల్య ఘటన

- మరో వ్యక్తి అరెస్ట్



**టీ మీడియా, డిసెంబర్ 21, బెంగళూరు :**
పార్లమెంట్ భద్రతా వైఫల్య ఘటనకు సంబంధించి కర్ణాటకకు చెందిన మాజీ పోలీస్ అధికారి కుమారుడు అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు గురువారం తెలిపారు. ఇంజనీర్ అయిన సాయికృష్ణ జాగాలిని బాగల్‌కోట్‌లోని ఆయన నివాసం నుండి బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అతనిని ఢిల్లీకి తీసుకురానున్నట్లు సమాచారం. సాయికృష్ణ లోక్‌సభలోకి చొరబడి రంగు పొగను వదిలిని ఇద్దరు నిందితుల్లో ఒకరైన మనోరంజన్ స్నేహితుడని పోలీసులు పేర్కొన్నారు. ఉగ్రవాద నిరోధక చట్టం, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద అభియోగాలు ఎదుర్కొంటున్న నలుగురు నిందితుల్లో మనోరంజన్ కూడా ఉన్నారు. సాయికృష్ణ, మనోరంజన్‌లు బెంగళూరులోని ఇంజనీరింగ్ కాలేజీలో బ్యాచ్‌మేట్స్‌గా ఉన్నారు. విచారణలో భాగంగా మనోరంజన్ చెప్పిన వివరాల ఆధారంగా సాయికృష్ణ అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఈ ఘటనపై సాయికృష్ణ సోదరి స్పందించారు. "ఢిల్లీ పోలీసులు వచ్చిన మాట వాస్తవమే. నా సోదరుడిని ప్రశ్నించారు. ఈ విచారణకు మేం పూర్తిగా సహకరించాం. సాయికృష్ణ ఎలాంటి తప్పు చేయలేదు. గతంలో సాయికృష్ణ, మనోరంజన్ రూమ్మేట్స్. ఇప్పుడు నా సోదరుడు వర్క్‌ఫ్రమ్ హోమ్‌లో చేస్తున్నాడు" అని అన్నారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటనలో పోలీసులు ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశారు.



# అట్టహాసంగా క్రీడాలు

**టీ మీడియా, డిసెంబర్ 21, మహానంది:**
మహానంది ఫారంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో ఆంగ్రు డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ సాంబశివరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె ఎస్ ఎస్ నాయక్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర కళాశాలల మూడవ విడత క్రీడలు,సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం 2023-24 గురువారం అట్టహాసంగా ముగిశాయి.ఈ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక అతిథిలుగా రామకృష్ణ డిగ్రీ కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణ, ఉద్యానవన పరిశోధన స్థానం హెడ్ డాక్టర్. ముత్యాల నాయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా రామకృష్ణ డిగ్రీ కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ ఇంత వ్యయప్రయాసాల కోర్చి విద్యార్థులకు క్రీడ సౌకర్యాలు కలిగించటం,ఇంత భారిగా విశ్వవిద్యాలయం ప్రతీ సంవత్సరం మూడు విడతలలో పోటీలను నిర్వహించడం హర్షనీయం అని తెలియజేశారు. అలాగే ఆసక్తి కలిగిన,పోటీ తక్కువగా ఉన్న క్రీడలను ఎన్నుకోవడం ద్వారా జాతీయ స్థాయిలో వెలుగొందే అవకాశం ఉందని, టేబుల్ టెన్నిస్,షటిల్ బ్యాడ్ మింటన్, చెస్ వంటి క్రీడలను ప్రోత్సహించాలని తెలిపారు. క్రీడల ద్వార శారీరక దారుఢ్యం మాత్రమే కాక జాతీయత భావం పెంపొందుతుందని తెలియజేశారు. అలాగే ఆటలతో పాటు రైతులకు నిస్వార్ధంగ సేవ చేసే విషయంలో పోటి పడాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల అసోసియేట్ డీన్ కె.యస్.యస్.నాయక్ మాట్లాడుతూ ఫుట్ బాల్ మ్యాచ్లో తిరుపతి విద్యార్థి జోయల్ గాయపడడం మినహా అన్ని సజావుగా జరిగాయని, ఆయనకు సకాలంలో వైద్యం అందించామని తెలిపారు.అన్ని సక్రమంగా జరగడానికి సహకరించిన సిబ్బందికి, క్రమశిక్షణతో మెలిగిన విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యానవన పరిశోధన స్థానం హెడ్ డా.ముత్యాల నాయుడు మాట్లాడుతూ ఎన్నుకొన్న క్రీడలు సాధన చేసి మరింత ఎత్తుకు ఎదగాలని ఆయన కోరారు.పశు పరిశోధన స్థానం హెడ్ డా.ఎమ్.వి.ధర్మా రావు మాట్లాడుతూ.. మన విజయాలని నిర్వచించేది మనం సాధించిన గెలుపు కాదు, కానీ మన నడవడిక, మనం గెలుచుకున్న మనసులు, మనం నేర్చుకున్న పాఠాలు అని చెప్తూ, విద్యార్థుల మధ్య స్నేహం పెంచుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యార్థుల వ్యవహారాల డీన్,డా.పి. సాంబశివరావు మాట్లాడుతూ.. తన అధ్యక్ష పలుకులలో తక్కువ సమయంలో తక్కువ వసతులు ఉన్నప్పటికీ, ఈ మీట్ ను విజయవంతంగా నిర్వహించిన వ్యవసాయ కళాశాల, మహానంది ని అభినందించారు.

సహకరించిన సిబ్బందికి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ మూడు విడతలలో ప్రతిభ కనపరించిన విద్యార్థులను జాతీయ స్థాయి వ్యవసాయ కళాశాలల ఆటల పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల యూనివర్సిటీ అబ్జర్వర్ రవికాంత్ రెడ్డి,తమ నివేదికను సమర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కళాశాల ఓ.ఎస్.ఎ, డా.పి.వి.రమేశ్ బాబు వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో డా.ఎల్.విజయ భాస్కర్, డా.కె.స్వరాజ్య లక్ష్మీ, డా.ఎమ్.శ్రీనివాస రెడ్డి, డా.ఎమ్.ఎస్.రాహుల్, డా.సరోజిన దేవి ,డా.జి.ఫరీద, డా.గీత శిరీష, డా.ఈ.ఎస్.వి. నారాయణ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

**టీ మీడియా, డిసెంబర్ 21, మహానంది:**



మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు సంబరాలలో భాగంగా మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలను జరిపినట్లు సమన్వయ కర్త పి. గోపాల్ గురువారం తెలిపారు. ఈ పోటీలో మొదటి, రెండవ బహుమతులను తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుపొందరని, పాఠశాల స్థాయిలో ప్రతిభ ప్రదర్శించిన అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని,విజేతలకు జడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, ఎంపీడీఓ శివ నాగ జ్యోతి, సర్పంచ్ శ్రీలక్ష్మి చేతుల మీదుగా మొమెంటో, సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఎంఈఓలు రామ సుబ్బయ్య, లింగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**టీ మీడియా, డిసెంబర్ 21,కందుకూరు :**
సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 51వ జన్మదినోత్సవ వేడు కలను ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొని 51. కేజీల భారీ కేకును కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య కట్ చేశారు. ఎంఎల్ఎ మహీధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరాయంగా కషి చేస్తున్నటువంటి ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్ రఫీ,గణేశం గంగి రెడ్డి, షేక్ ఖాదరబాషా, కిషొర్ ఉన్నారు.

## బకాయిల చెల్లింపులో అలసత్వం

- విజయవాడలో 7న 36 గంటల దీక్ష
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

**టీ మీడియా, డిసెంబర్ 21,శ్రీకాకుళం :**



ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏడాది కాలంగా పేరుకుపోయిన పలు రకాల ఆర్థిక బకాయిలు రూ.11,462 కోట్ల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వచ్చే జనవరి ఏడో తేదీన విజయవాడలో 36 గంటల దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సెప్టెంబర్ నాటికి అన్ని రకాల బకాయిలూ చెల్లిస్తామని మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చినా ఇంతవరకూ అమలు చేయలేదని తెలిపారు. జనవరి ఏడో తేదీలోపు అన్ని రకాల బకాయిలూ వెంటనే చెల్లించకపోతే ఏడో తేదీన 36 గంటల దీక్ష చేపడతామన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరించే వారికే వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. దీనిపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సంతాప సందేశం

- రాయాల్సిన సమయం ఆసన్నమైంది
- ఎంపీ శశిథరూర్



**టీ మీడియా, డిసెంబర్ 21, న్యూఢిల్లీ :**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలైన నుంచి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా వైఫల్యం ఘటన నుంచి ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి హోంమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టగా.. సభలో 143 మంది ప్రతిపక్ష ఎంపీలు సస్పెండ్ అయ్యారు. అధికార పార్టీపై విపక్ష కూటమి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎంపీల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ నేత శశి థరూర్ కేంద్రంపై మండిపడ్డారు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సంతాప సందేశాలు రాయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. శశిథరూర్ పార్లమెంట్ హౌస్ నుంచి విజయ్ చౌక్ వరకు జరిగిన మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ.. సందేశం చాలా సులభమని.. ప్రజాస్వామ్యంలో పార్లమెంట్‌ను నిర్వహించాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం సీనియర్‌గా తీసుకోని పరిస్థితి మనం చూస్తున్నామన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని గౌరవించేందుకు కేంద్రం సుముఖత చూపడం లేదనం విమర్శించారు. మంత్రిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా, సభకు హాజరుకావడానికి నిరాకరించడమే కాకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అమిత్ షా అవమానించారని మండిపడ్డారు. సభలో కాకుండా బయట జర్నలిస్టులతో మాట్లాడరని.. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయంలోని రూల్ అని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరు ఆమోదయోగ్యం కాదని.. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని గౌరవించడానికి ఇష్టపడలేదన్నారు. భద్రతా వైఫల్యంపై చర్చ జరపాలని ఎంపీలు డిమాండ్ చేస్తే సస్పెండ్ చేశారని.. 97 మంది ఎంపీలు సభలో లేకుండానే లోక్‌సభలో మూడు క్రిమినల్ లా బిల్లలను ఆమోదించడం అవమానకరమన్నారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు, చర్చలు లేకుండానే ఈ చట్టాలను రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం దేశానికి ఎంత నష్టం కలిగించిందో అర్థం చేసుకోవచ్చునన్నారు.